రూపాయల నోట్లు కుక్కుతున్నారు. అవన్నీ జేబులో పెట్టుకుంటూ ఠీవిగా నడుస్తున్నాడు పాపారావు చేతిలో లాఠీ అప్పుడప్పుడూ రోడ్డుమీద టకటక కొట్టుకుంటూ ఆ వీధిలోనే... అదొక పాత పెంకుటిల్లు సగం పెచ్చులూడిన అరుగుమీద కుప్పలా కూలబడిపోయినట్లు కూర్చుంది ఓ అమ్మాయి.

అరుగుమీద లాఠీ టకటక లాడించి 'ఊ' అన్నాడు గంభీరంగా.

"ఈ రోజు ఏమీ బేరం లేదు బాబూ రేపు చూసుకుందాం రండి" అంది ఎంతో వినయంగా కూర్చున్న ఆ అమ్మాయి.

'ఎప్పుడూ చెప్పే కబుర్లే లేవే... తియ్ బయటికి తియ్" అన్నాడు లాఠీ ఝుళిపిస్తూ.

పైకి మెల్లిగా లేచి కొంగున ఉన్న మూడు రూపాయలూ తీసి అందించింది.

"ఒళ్ళు బాగుండటం లేదయ్యా రొట్టెకు పాలుకు ఉంచుకున్నా"అంది వేడుకోలుగా.

"ఒక్కరోజుకి చచ్చిపోవులేవే రేపు చూసుకో అయన్నీ"అంటూ పళ్ళికిలించుకుంటూ వెళ్ళిపోయాడు పాపారావు.

పాపారావు కనకయ్య నాలుగురోడ్ల జంక్షన్ దగ్గర కలుసుకున్నారు. రేపుస్టేషన్లో ఎంత ఇవ్వాల్సింది చర్చించుకున్నారు "రేపు మంత్రిగారితో పాటు మన డిపార్ట్‌మెంట్ పెద్దాఫీసరుగారు కూడా వస్తారట కనకయ్యా అన్ని ఏర్పాట్లు ఘనంగా చెయ్యమని మన ఎస్పీగారి ఆర్డరు"అన్నాడు పాపారావు. అంతలో ఒక వ్యాను రివ్వున దూసుకుంటూ వారి ప్రక్కగా వెళ్ళి కొంచెం దూరంలో ఆగింది! గోతిలో నుండి చిమ్మిన నీళ్ళను దులుపుకుంటూ కోపంగా చూశారు ఆ వ్యానువైపు వాళ్ళిద్దరూ!

"అయ్యా అమ్మా రేపు మన పట్టణానికి ప్రజా సంక్షేమ శాఖామాత్యులుగారు విచ్చేయు చున్నారు. ప్రజా సంక్షేమ పథకాలన్నీ మీకు వారు తెలియజేస్తారు. అందరూ బహిరంగ సభలో పాల్గొనవలసిందిగా కోరుతున్నాం"

వ్యానుకు కట్టి ఉన్న మైకులోంచి వినబడుతోంది ఈ అనౌన్స్‌మెంటు. రోడ్డుమీద ప్రజలు ఆనందంగా చూస్తున్నారు ఆ వ్యాను వైపు.

"ఆయనెవడ్రా బాబు మన నోట్ల మట్టికుక్కేలానున్నాడు" అన్నాడు కనకయ్య కసిగా.

"ఆ.. మన సర్వీసులో ఎంతమందిని చూడ్లేదూ" అంటూ పెదవి విరిచాడు పాపారావు బీడీ తీసి నోట్లో పెట్టుకుంటూ!

—జొలా నటరాజు

ఈ కొత్త రచయితల శీర్షికలో
ప్రతి వారం వారం
ఒక మంచి కథకు
116 రూపాయలు
బహుమతిగా అందజేస్తాం
—ఎడిటర్

## ఈ వారం బహుమతిపొందిన కథ

# తప్పులెన్నువారు

సమయం 9.30 అయింది. అన్ని రకాల ఆఫీసుల ఉద్యోగులు బస్సు కోసం క్యూలో నిలబడ్డారు. రోజూ తొమ్మిది ఇరవైకే వచ్చే బస్సు తొమ్మిదిన్నర అయినా రాలేదు. లైన్లో ఉన్న గిరిజ పక్కనున్న కొలీగ్ కోమలితో "చూడండి ఈ బస్సు వాళ్ళు ఎప్పుడూ టైమ్‌కి రారు, మనమేమో టైము వేస్టు చేసుకొని ఈ క్యూలో నిలబడటం, వీళ్ళేమో రాజుల్లా ఎక్కడో హోటల్లో కూర్చొని టైమ్ పాస్ చేస్తూ టైముకి రాకపోవడం మామూలు అయిపోయింది" అంది విసుక్కుంటూ కోమలి ఆశ్చర్యపడుతూ అంది, "రోజూ తొమ్మిది ఇరవైకి మనం వచ్చే సరికి బస్సు రడీగానే ఉంటుంది కదా,



ఈ రోజే కదా కొంచెం లేటుఅయింది. వాళ్ళు కూడా మనలాంటి ఉద్యోగులేకదా, ఏదైనా ఇబ్బంది వచ్చిందేమో అందుకే లేట్ అయి ఉంటుంది"

ఈలోగా బస్సు రావడం, అందరూ ఎక్కటం చకచకా జరిగిపోయింది. గిరిజ డ్రైవర్‌తో "ఎందుకు బస్సు లేటైంది?" అంది. 'ట్రాఫిక్ జామ్ అయిందండి' మామూలుగా అన్నాడు డ్రైవర్.

'ఏం ట్రాఫిక్ జామో ఏమో, ఇక్కడ క్యూలో నిలబడలేక చావని అవుతున్నది." ఈ కాలనీలో ఎప్పుడు బస్సులు వస్తాయో, ఎప్పుడు పోతాయో అర్థం కాదు. టైమింగ్స్ అసలు మెయిన్‌టెయిన్ చెయ్యరు" అంటూ పెద్దగా వ్యాఖ్యానించింది కోమలి వారిస్తున్నా వినకుండా. ఆఫీస్ స్టాప్ రాగానే ఇద్దరూ దిగిపోయారు.

అది రాష్ట్రప్రభుత్వ కార్యాలయం కావటంతో అప్పటికే చాలామంది జనం ఉద్యోగుల గురించి ఎదురు చూస్తున్నారు. గిరిజ సీటులో కూర్చోగానే 'మేడమ్ మాకి కులం సర్టిఫికెట్లు విన్న ఇక్కడ ఇచ్చాము, మాకు ఈ రోజు చాలా అర్జంట్‌గా' కావాలి, కాలేజి అడ్మిషన్లు లాస్ట్ డేట్ ఈ రోజే అన్నారు విద్యార్థులు నల్గురు వచ్చి. 'చూడండి నాకు ఇదొక్కటే పని లేదు, రెండు రోజుల తర్వాత వచ్చి తీసుకెళ్ళండి' అంది."ప్లీజ్ మేడమ్ ఈరోజే సర్టిఫికెట్లు కావాలి. లేకపోతే సీటు దొరకదు. రేపటి నుంచి ఆఫీసుకి రెండు రోజులు సెలవలు. అందుకే కొంచెం ఎలాగైనా ఈ రోజే ఇవ్వండి" అన్నారు బతిమాలుతూ.

"చూడండి మీకు అంత అవసరం అయితే నాలుగు రోజుల ముందరే వచ్చి ఇవ్వాలి. ఇప్పుడు ఇవ్వటానికి నాకు వీలులేదు."

"లేదు మేడమ్ మేము నాలుగురోజుల నుండి తిరుగుతున్నాము. రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ లేరు"

"ఏమైనా చేసుకోండి, ఇంకా ఇక్కడే నిలబడితే వారం రోజుల తర్వాత ఇవ్వాల్సి వస్తుంది. నా టైమ్ వేస్టు చెయ్యకుండా వెళ్ళండి" విసుక్కుంటూ అంది. వాళ్ళు నిరాశతో వెళ్ళిపోయారు.

పక్కసీటులో ఉన్న కోమలి కొత్తగా ఆ ఆఫీసులో జాయిన్ అయింది. గిరిజ ప్రవర్తన చాలా వింతగా తోచింది. బస్సు పదినిమిషాలు లేటుగా వస్తే అంతగా విసుక్కున్న మనిషి, కాలేజి విద్యార్థులు ఎంత ప్రతిమాలినా వాళ్ళ సర్టిఫికెట్లు ఇవ్వలేదు. చేస్తే ఆ పని పావుగంట పట్టదు. తనకైతే టైము చాలా విలువైనది, ఇతరులకు కాదా? బస్సు డ్రైవర్ అయినా, ఆఫీస్‌కి వచ్చే పబ్లిక్ అయినా టైము ఎవరికైనా విలువ అయినదే కదా! ఒకే కోణంలో తన వరకే ఆలోచించుకొనే గిరిజలాంటి సంకుచిత మనస్తత్వం ఉన్న వాళ్ళ గురించి ఆలోచిస్తూ పనిలో పడింది.

—గొల్లపూడి శ్యామల